క్లుప్తంగా

చిన్నతనం నుంచే సేవాగుణం అలవరుచుకోవాలి



వృద్ధాశ్రమానికి ఫ్యాన్, సరుకులు అందజేస్తున్న విద్యార్థులు

చిల్లకూరు : పిల్లలు చిన్నతనం నుంచే సేవా గుణం అలవరుచుకోవాలని గూడూరు పట్టణం లోని గాయత్రి ఇంగ్లీషు మీడియం పాఠశాల కరస్పాండెంట్ శివకుమార్‌రెడ్డి తెలిపారు. ఆ పాఠశాల విద్యార్థులు శనివారం సాయిరాం వృద్ధాశ్రమంలోని వృద్ధుల కోసం నెలకు సరిపడా ఫల సరుకులు, బియ్యం బస్తా, స్టాండ్ ఫ్యాన్ అందజేశారు. కార్యక్రమంలో వృద్ధాశ్రమం నిర్వాహకులు కళ్యాణి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఔట్ సోర్సింగ్, కాంట్రాక్టు ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

కోట : ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను నెరవేర్చాలని కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల అసోసియేషన్ నాయకులు కోరారు. వారు శనివారం కోట మండలంలో ఉన్న ఎస్సీ, ఎస్టీ, బీసీ గురుకులాల్లో పనిచేస్తున్న ఔట్ సోర్సింగ్, కాంట్రాక్టు సిబ్బందిని కలిసి సమస్యలపై చర్చించారు. అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి పనబాక హేమంత్ మాట్లాడుతూ గురుకులాల్లో ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు తక్కువ జీతాలతో పనిచేస్తున్నారని తెలిపారు. వారిపై పనిఒత్తిడి ఎక్కువగా ఉందన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు జీతాలు పెంచాలన్నారు. అనంతరం అసోసియేషన్ క్యాలెండర్‌ను ఆవిష్కరించి సిబ్బందికి అందజేశారు. ఈ కార్యక్రమంలో జయశేఖర్, సైరాభాను, మంచాల సనత్, అనీల్, చెంగయ్య తదితరులు పాల్గొన్నారు.

మొక్కలతోనే మానవ మనుగడ



కొబ్బరి మొక్కలు నాటుతున్న ఆలయ కమిటీ సభ్యులు

చిల్లకూరు : మొక్కలతోనే మానవ మనుగడ సాధ్యమని కలవకొండ లక్ష్మీ నరసింహ స్వామి ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. వారు శనివారం లక్ష్మీనరసింహస్వామి ఆలయ కొండపై 40 కొబ్బరి మొక్కలు నాటారు. వారు మాట్లాడుతూ కొండపై పచ్చదనం పెంచాలన్న ఉద్దేశంతో గతంలో సుమారు ఒక ఎకరా భూమిలో ఔషధ మొక్కలు నాటినట్టు తెలిపారు. ప్రస్తుతం కొండపైకి వెళ్లే దారి పొడవునా 40 కొబ్బరి మొక్కలు నాటి, సంరక్షించే బాధ్యతను చేపట్టినట్టు తెలిపారు.

ఆరుగాలం కష్టపడి పంటలు సాగుచేసిన రైతుకు తగిన ఫలితం దక్కడం లేదు. ప్రభుత్వం ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయలేదు. తాము చెప్పిందే ధర అన్నట్టు దళారులు రెచ్చిపోతున్నారు. పైగా తరుగు పేరుతో బస్తాకు నాలుగు కేజీలు కోత పెడుతున్నారు. వరుస తుపానులు, అకాల వర్షాలకు పంటలు దెబ్బతినడం, అరకొరగా వచ్చిన దిగుబడికి గిట్టుబాటు ధర అందకపోవడంతో రైతులు లబోదిబోమంటున్నారు.

ఏకొల్లు గ్రామంలో లారీలో ధాన్యం బస్తాలు లోడ్ చేస్తున్న కూలీలు



దళారుల దందా..

- ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయని ప్రభుత్వం
- దళారులు చెప్పిందే ధరగా మారిన వైనం
- తరుగు పేరుతో బస్తాకు నాలుగు కేజీల కోత
- దిగుబడులు రాక, ధరలు లేక నష్టపోతున్న అన్నదాతలు



ఏకొల్లు గ్రామ పరిధిలో ముమ్మరంగా వరి కోతలు

దొరవారిసత్రం : మండలంలో ఎక్కువ మంది రైతులు వరి పంటను సాగు చేస్తారు. రబీ సీజన్‌లో 11,500 ఎకరాల్లో వరి పంట సాగు చేశారు. ఇందులో ఎలిది (ఎకరాకు ఖర్చు రూ.20 వేల నుంచి రూ.25 వేలు) కింద 7,500 ఎకరాలు, వరి నాట్లు (ఎకరా ఖర్చు రూ.30 వేల నుంచి రూ.35 వేలు) కింద 4,000 ఎకరాల్లో సాగైంది. ఈ రబీ సీజన్‌లో రైతు సేద్యం మొదలైనప్పటి నుంచి పంట ఎన్ను తీసే వరకు రెండు సార్లు తుపాను ప్రభావంతో భారీ వర్షాలు కురిశాయి. మరో రెండుసార్లు అకాల వర్షాలు కురవడంతో వరి పంట తీవ్రంగా దెబ్బతినింది. మిగిలిన పంట కూడా అరకొరగా దిగుబడి వచ్చింది. ప్రస్తుతం వరికోతలు మొదలయ్యాయి. మండలంలోని ఏకొల్లు, వెదురుపట్టు, కుప్పారెడ్డిపాలెం, అక్కరపాక, ఎస్ఎం అగ్రహారం, గొల్లపాళెం, పూలతోట, కల్లూరు, శ్రీధనమల్లి, మైలాంగం, నేలపట్టు, నెలబల్లి, నెల్లూరుపల్లి, ముచ్చలగుంట, కొత్తపల్లి, సింగనాలత్తూరు, మేలనాలత్తూరు, మీజూరు, ఉచ్చూరు, కారికాడు, వేలికాడు, తనియాలి, తల్లంపాడు, లింగంపాడు, మొదుగుళపాళెం, వేటగిరిపాళెం, కమ్మకండ్రిగ, బూదూరు తదితర గ్రామాల్లో వరి కోతలు ముమ్మరంగా సాగుతున్నాయి. ఈ ప్రాంతాల్లో ఎకరాకు 20 నుంచి 25 బస్తాలు దిగుబడి వచ్చింది. ఏకొల్లు ప్రాంతంలో ఎకరాకు 16 బస్తాలు మాత్రమే దిగుబడి వచ్చింది.

కనిపించని ధాన్యం కొనుగోలు కేంద్రాలు

ప్రభుత్వం ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటుచేయలేదు. దీన్ని ఆసరాగా తీసుకున్న దళారులు తాము చెప్పిందే ధర అన్నట్టు వ్యవహరిస్తున్నారు. కనీసం మద్దతు ధర కూడా ఇవ్వడం లేదు. గత ఏడాది పెద్ద జిలకర్లు, కేఎంఆర్(రకం1630) బస్తా ధాన్యం రూ.2,000 నుంచి రూ.2,175 వరకు పలికింది. అదే రకాలు ఇప్పుడు రూ.1,550 నుంచి రూ.1,600 వరకు పలుకుతోంది. ప్రభుత్వం ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి ఉంటే గిట్టుబాటు ధర లభించేది. దీనికితోడు దళారులు నెమ్ము, గోని సంచి తూకం పేరుతో 75 కేజీల బస్తాకు 4 కేజీల వరకు ధాన్యంలో కోత విధిస్తున్నారు. మరో వైపు కాటా వద్ద టన్నుకు 7 నుంచి 10 కేజీల వరకు అవి ఇవి రైతుకు చెప్పి తగ్గిస్తున్నారు. దీంతో పెట్టుబడులు కూడా రావడం లేదని రైతులు వాపోతున్నారు.

పెట్టుబడులు కూడా రాలేదు



నేను సొంత భూమి ఎకరా, మరో రెండు ఎకరాలు లీజుకు తీసుకుని వరి పంట సాగు చేశాను. వరుస తుపానులు, అకాల వర్షాలతో పంట దెబ్బతినింది. ఎకరాకు 14 బస్తాల దిగుబడి వచ్చింది. పెట్టుబడి కూడా రాలేదు. ప్రభుత్వ ఆదుకోకపోతే నష్టాల ఊబిలో కూరుకుపోవాల్సిందే. – బందిలి చిట్టిబాబు, ఏకొల్లు

దళారులు మోసం చేస్తున్నారు



నేను రెండు ఎకరాల్లో వరి సాగు చేశాను. ఎకరాకు 20 బస్తాల దిగుబడి వచ్చింది. దళారులు ఇష్టారాజ్యంగా కాటా వేస్తున్నారు. ఏమైనా అడిగితే ఇష్టం ఉంటే ఇవ్వండి లేకపోతే పోండి అంటున్నా రు. చేసేది లేక ధాన్యం దాచుకోలేక కల్లంలోనే కష్టమో నష్టమో అమ్ముకోవాల్సిన దుస్థితి ఏర్పడింది. – తుమ్మా శేషయ్య, పోలిరెడ్డిపాళెం

ఆరు చోట్ల ధాన్యం కొనుగోలు కేంద్రాల ఏర్పాటు



మండలంలోని పూలతోట, నెలబల్లి, తల్లంపాడు, పోలిరెడ్డిపాళెం, తొగరాముడి, ఉచ్చూరు గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నాము. ప్రభుత్వం నిర్ణయించిన విధంగా గ్రేడ్ ఏ రకం 75 కేజీల బస్తా రూ.1,740, సాధారణ రకం ధాన్యం రూ.1,725లకు కొనుగోలు చేస్తున్నాం. దళారులపై చర్యలు తీసుకుంటాం. – ఏ జ్యోతిర్మయి, ఏవో, డీవీ సత్రం

8, 9న స్వాతంత్య్ర సమరయోధుల చిత్ర పటాల ప్రదర్శన

చిల్లకూరు : గూడూరు పట్టణంలోని షాదీ మంజిల్‌లో ఈ నెల 8, 9 తేదీల్లో స్వాతంత్య్ర సమరయోధుల చిత్రాల ప్రదర్శన చేపట్టనున్నట్టు ఫ్రీడం ఫైటర్స్ ఎక్స్‌పో కమిటీ సభ్యులు పిలుపునిచ్చారు. వారు శనివారం షాదీ మంజిల్‌లో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ ఎంతోమంది నాయకులు దేశ స్వాతంత్య్రం కోసం ప్రాణాలు త్యాగం చేశారని తెలిపారు. వారి గురించి నేటి తరం వారికి సరిగా తెలియదన్నారు. ఈ క్రమంలో వారి పూర్తి వివరాలతో కూడిన చిత్ర పటాల ప్రదర్శనను నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ఇందుకు ప్రముఖ చరిత్రకారులు నజీర్ అహ్మద్ సహకారం అందిస్తున్నారని వెల్లడించారు. అలాగే ఎవరి వద్దనైనా సమరయోధుల చిత్ర పటాలు ఉంటే వాటిని కూడా ప్రదర్శనలో పెట్టవచ్చన్నారు. ఈ ప్రదర్శనను విద్యార్థులు తిలకించేలా యాజమాన్యాలు చొరవ చూపాలని కోరారు. ఎండీ అబ్దుల్ రహీం, షేక్ కాలేషా, నావిన భాస్కర్ గౌడ్, డేగా రవి రాఘవేంద్ర, నాజర్, జహంగీర్, యస్దాని, అన్వర్‌బాషా తదితరులు పాల్గొన్నారు.

కండలేరులో 54.588 టీఎంసీల నీరు

రాపూరు: కండలేరు జలాశయంలో శనివారం నాటికి 54.588 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు ఈఈ విజయకుమార్‌రెడ్డి తెలిపారు. కండలేరుకు సోమశిల జలాశయం నుంచి 150 క్యూసెక్కుల నీరు వస్తోందన్నారు. అలాగే కండలేరు నుంచి సత్యసాయి గంగ కాలువకు 650, లోలెవల్ కాలువకు 70, హైలెవల్ కాలువకు 170, మొదటి బ్రాంచ్ కాలువకు 70 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నట్లు తెలిపారు.

అట్టహాసంగా కబడ్డీ టోర్నమెంట్ ప్రారంభం



పోటా పోటీగా కబడ్డీ పోటీలు ఆడుతున్న బాలికలు

వెంకటగిరి రూరల్ : వెంకటగిరి పట్టణంలోని విశ్వోదయ కళాశాల క్రీడా ప్రాగణంలో శనివారం పోలీసు శాఖ ఆధ్వర్యంలో నియోజకవర్గ స్థాయి కబడ్డీ టోర్నమెంట్ ప్రారంభమైంది. వెంకటగిరి ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ, గూడూరు డీఎస్పీ గీతాకుమారి ముఖ్య అతిథులుగా పాల్గొని పోటీలను ప్రారంభించారు. డీఎస్పీ మాట్లాడుతూ విద్యార్థులు విద్యతోపాటు క్రీడల్లోనూ రాణించాలన్నారు. పిల్లలు ఫోన్ వినియోగించే సమయంలో తల్లిదండ్రులు దృష్టి సారించాలన్నారు. ఫోన్‌లో ఏమి చేస్తున్నారు. ఏ వీడియోలు చూస్తున్నారు అనే అంశంపై నిఘా ఉంచాలన్నారు. గుర్తు తెలియని నంబర్ల నుంచి వచ్చే ఫోన్ కాల్స్, లింక్‌లపై క్లిక్ చేయరాదని సూచించారు. అనంతరం యోగాలో గిన్నిస్ బుక్ రికార్డు సాధించిన వసంత లక్ష్మిని సత్కరించారు. కార్యక్రమంలో సీఐ ఏవీ రమణ, ఎస్ఐలు లక్ష్మీభవాని, గోపి, ఎంపీపీ తంబిరెడ్డి తనుజారెడ్డి, ఎంపీడీవో కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

మద్యం షాపులో చోరీ

కోట : మండలంలోని చిట్టేడు మద్యం షాపులో శుక్రవారం రాత్రి దుండగులు చోరీకి పాల్పడ్డారు. దుండగులు గడ్డపారతో తాళాలు పగులగొట్టి రూ.1.75 లక్షల నగదు, మూడు మద్యం బాటిళ్లు చోరీ చేసినట్టు నిర్వాహకుడు రాహుల్ తెలిపారు. ఎస్ఐ పవన్‌కుమార్‌కు ఫిర్యాదు చేశారు. ఎక్సైజ్ సీఐ ప్రసాద్, ఎస్ఐ పవన్‌కుమార్ షాపును పరిశీలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్టు తెలిపారు.

గౌడ కులస్తులకు మూడు మద్యం షాపులు

సూళ్లూరుపేట: సూళ్లూరుపేట ఎక్సైజ్ అండ్ ప్రొహిబిషన్ పరిధిలోని సూళ్లూరుపేట, తడ, దొరవారిసత్రం మండలాలకు సంబంధించి కల్లుగీత కార్మికులైన గౌడ కులస్తులకు ప్రభుత్వం మూడు మద్యం షాపులు మంజూరు చేసిందని సీఐ సురేంద్రబాబు తెలిపారు. ఒక్కో మండలానికి ఒక్కరికి మద్యం షాపును కేటాయిస్తున్నట్టు తెలిపారు. అర్హులు ఎక్సైజ్ అండ్ ప్రొహిబిషన్ పోలీస్‌స్టేషన్‌కు వచ్చి దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

ఎమ్మెల్యే తీరుపై రైతుల అసహనం

చిల్లకూరు : క్రిస్ సిటీ కోసం సేకరించిన భూములకు పరిహారం విషయం మాట్లకుండా పరిశ్రమ యాజమాన్యాలకు సహకరించాలని ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ చెప్పడంపై రైతులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. కోట, చిల్లకూరు మండల తీర ప్రాంత గ్రామాల్లో సుమారు 900 ఎకరాల భూములు సేకరించారు. సాగు భూములకు ఎకరాకు రూ.7 లక్షల వరకు పరిహారం ఇస్తామని కలెక్టర్ వెంకటేశ్వర్ ప్రకటించారు. ఇప్పటి వరకు పరిహారం ఇవ్వలేదు. ఇటీవల ప్రధాని వైజాగ్ పర్యటన సందర్భంగా క్రిస్ సిటీని వర్చువల్‌గా ప్రారంభించారు. ఈ క్రమంలో ఒక పరిశ్రమ నిర్వాహకులు ఆ భూముల్లో అభివృద్ధి పనులు మొదలుపెట్టారు. పరిహారం ఇవ్వకుండా పనులు చేయొద్దని బాధిత రైతులు అడ్డుపడుతున్నారు. ఈ విషయాన్ని ఆ సంస్థ ప్రతినిధులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. ఈ నేపథ్యంలో ఎమ్మెల్యే సునీల్‌కుమార్ శనివారం కొత్తపట్నం వద్ద రైతులతో సమావేశమయ్యారు. రైతులకు అండగా ఉంటామని చెబుతూనే పరిశ్రమ యాజమాన్యాలకు సహకారం అందించాలని సూచించారు. సీఎంతో చర్చించిన అనంతరం పరిహారం పెంచే విషయంపై క్లారిటీ ఇస్తామని చెప్పారు. భూములు కోల్పోయిన 8 గ్రామాల్లో ఐదుగురు చొప్పున సభ్యులతో కమిటీ వేసుకుని వస్తే పరిశ్రమల యజమానులతో మాట్లాడి సమస్యలు పరిష్కరిస్తామని చెప్పారు. పరిహారం గురించి మాట్లాడకపోవడంపై రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. రైతులతో మాట్లాడే విషయం అధికారులు, మీడియాకు తెలియకుండా గోప్యంగా ఉంచడంపై పలు అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి.

సూళ్లూరుపేట రూరల్ ట్రాన్స్‌కో ఏఈగా పూర్ణిమ

సూళ్లూరుపేట : సూళ్లూరుపేట రూరల్ ట్రాన్స్‌కో ఏఈగా కె.పూర్ణిమ శనివారం బాధ్యతలు చేపట్టారు. ఆమె చంద్రగిరి మండలంలో జేఈగా పనిచేస్తూ ప్రమోషన్‌పై ఇక్కడికి వచ్చారు. సూళ్లూరుపేట పట్టణ ఏఈ పోస్టు కూడా ఐదేళ్లుగా ఖాళీగా ఉంది. ఆ స్థానంలో పాపానాయుడుపేటలో జేఈగా పనిచేస్తున్న మోహినిని ప్రమోషన్‌పై సూళ్లూరుపేట పట్టణ ఏఈగా బదిలీ చేశారు. ఆమె ఇటీవల బాధ్యతలు చేపట్టారు.



ఏఈ కె.పూర్ణిమ

పరిహారం చెల్లించాలని వినతి

కోట: సాగరమాల రోడ్డుకు భూములు ఇచ్చిన రైతులకు వెంటనే నష్టపరిహారం చెల్లించాలని నెల్లూరుపల్లి, కొత్తపాళెం రైతులు కోరారు. గూడూరు సబ్‌కలెక్టర్ రాఘవేంద్రమీనన్ శనివారం నెల్లూరుపల్లిలో రైతులతో సమావేశమయ్యారు. వైఎస్సార్ సీపీ నాయకుడు నేదురుమల్లి హరీష్‌చంద్రారెడ్డి మాట్లాడుతూ రోడ్డుకు భూములు ఇచ్చిన రైతుల్లో 49 మందికి ఇప్పటి వరకు పరిహారం ఇవ్వలేదన్నారు. పంటల సాగు లేక, పరిహారం అందక రైతులు ఇబ్బంది పడుతున్నారని వివరించారు. సబ్‌కలెక్టర్ మాట్లాడుతూ భూరికార్డులన్నీ సక్రమంగా ఉన్న వారికి నష్టపరిహారం ఇచ్చామన్నారు. రైతుల సమస్యలు తెలుసుకుని పరిష్కరిస్తామన్నారు. తహసీల్దార్ జయజయరావు పాల్గొన్నారు.



సబ్‌కలెక్టర్‌తో మాట్లాడుతున్న నేదురుమల్లి హరీష్‌చంద్రారెడ్డి, రైతులు

మంచి నాయకుడిని కోల్పోవడం బాధాకరం



బలరామిరెడ్డి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న సంజీవయ్య

నాయుడుపేట టౌన్ : అందరితోనూ మంచిగా మెలుగుతూ, నాయకత్వ లక్షణాలు కలిగిన తంబిరెడ్డి బలరామిరెడ్డిని కోల్పోవడం బాధగా ఉందని సూళ్లూరుపేట మాజీ ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య తెలిపారు. బలరామిరెడ్డి ఉత్తర క్రియలు శనివారం నాయుడుపేట పట్టణంలోని ఆయన నివాసం వద్ద నిర్వహించారు. ఇందులో మాజీ ఎమ్మెల్యేతో పాటు వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు. బలరామిరెడ్డి చిత్రపటం వద్ద పుష్ప గుచ్చాలు ఉంచి అంజలి ఘటించారు. డీసీసీబీ మాజీ చైర్మన్ కామిరెడ్డి సత్యనారాయణ రెడ్డి, పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు తంబిరెడ్డి సుబ్రమణ్యం రెడ్డి, ఏఎంసీ మాజీ చైర్మన్ తంబిరెడ్డి జనార్దన్‌రెడ్డి, ఎంపీపీ ధనలక్ష్మి, పార్టీ మండల, పట్టణ అధ్యక్షులు కలికి మాధవరెడ్డి, ఓట్టూరు కిషోర్ యాదవ్, పాదర్తి హరినాథ్‌రెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ వెంకటకృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు క్రీడల్లోనూ రాణించాలి



విజేతలకు బహుమతులు అందజేస్తున్న డీఎస్పీ

గూడూరు రూరల్ : విద్యార్థులు క్రీడా స్ఫూర్తిని పెంపొందించుకోవాలని గూడూరు డీఎస్పీ గీతాకుమారి సూచించారు. గూడూరు సమీపంలోని నారాయణ ఇంజినీరింగ్ కళాశాలలో శనివారం స్పోర్ట్స్ మీట్ నిర్వహించారు. విజేతలకు బహుమతులు అందజేశారు. ఆమె మాట్లాడుతూ విద్యార్థులు విద్యతోపాటు క్రీడల్లోనూ రాణించాలన్నారు. స్పోర్ట్స్ కోటాలో ఉద్యోగ అవకాశాలు ఎక్కువగా ఉంటాయన్నారు. ప్రిన్సిపాల్ రవిప్రసాద్, వైస్ ప్రిన్సిపాల్ జేవీభాస్కర్, స్పోర్ట్స్ ఇన్‌చార్జి డి.రాజేష్‌రెడ్డి, పీడీలు రాఘవయ్య, సౌమ్య పాల్గొన్నారు.

పింఛను పంపిణీ చేసిన ఎమ్మెల్యే

ఓజిలి: మండలంలోని నెమళ్లపూడి గ్రామ పంచాయతీలో శనివారం ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ సామాజిక పింఛన్లు పంపిణీ చేశారు. ఆమె మాట్లాడుతూ అర్హులందరికీ ప్రభుత్వ పథకాలు అందించేందుకు కృషిచేస్తామన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీ ఎన్ సుబ్రమణ్యం, ఎంపీడీవో విజయలక్ష్మి, నాయకులు విజయ్‌కుమార్‌నాయుడు, కొప్పల మునిరాజ, సర్పంచ్ ఖాదర్‌బాషా, మహిళ అధ్యక్షురాలు కే పవిత్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆరుగురు దొంగల అరెస్టు

పెళ్లకూరు: పెళ్లకూరు, దొరవారిసత్రం, ఓజిలి, నాయుడుపేట, శ్రీకాళహస్తి పరిసర ప్రాంతాల్లో 26 విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లను చోరీ చేస్తున్న ఆరుగురు దొంగలను అరెస్టు చేసినట్టు సీఐ సంగమేశ్వరరావు తెలిపారు. ఆయన శనివారం విలేకరులతో మాట్లాడుతూ పెళ్లకూరు మండలం చెంబేడుకు చెందిన అనీల్, కిరణ్, రమణయ్య, పార్థు, నిరంజన్, చిన్న మద్యానికి బానిసలై చోరీలకు పాల్పడుతున్నారని తెలిపారు. పెళ్లకూరులో 6 ట్రాన్స్‌ఫార్మర్లు, దొరవారిసత్రంలో 5 ట్రాన్స్‌ఫార్మర్లు, నాయుడుపేటలో 2 ట్రాన్స్‌ఫార్మర్లు, ఓజిలిలో 4 ట్రాన్స్‌ఫార్మర్లు, సూళ్లూరుపేటలో 2 ట్రాన్స్‌ఫార్మర్లు, శ్రీకాళహస్తిలో 7 ట్రాన్స్‌ఫార్మర్లు చోరీ చేశారని తెలిపారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసులు దర్యాప్తు చేసి నిందితులను అరెస్టు చేశామన్నారు. వారిచ్చిన సమాచారం మేరకు కాపర్‌ను కొలుగోలు చేసిన శ్రీకాళహస్తికి చెందిన బాబు, సత్యవేడుకు చెందిన తిరుమలపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. నిందితుల నుంచి రూ.29,700 విలువైన 285 కేజీల కాపర్, నేరాలకు ఉపయోగించిన రూ.10 లక్షల విలువైన రెండు ఆటోలను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. చోరీ కేసుల్లో నిందితులను పోలీసులు అరెస్టు చేసి కోర్టుకు తీసుకెళుతున్న సమయంలో వారి బంధువులు పెద్ద సంఖ్యలో పోలీస్‌స్టేషన్ వద్దకు చేరుకుని ఆర్తనాదాలు చేశారు. ఎస్ఐ నాగరాజు పాల్గొన్నారు.

రెండు బైక్‌ల చోరీపై కేసు నమోదు

చిట్టమూరు : మండలంలోని గునపాడు, ఆలేటిపాడు గ్రామాల్లో రెండు బైక్‌లు చోరీకి గురయ్యాయని, బాధితుల ఫిర్యాదు మేరకు శనివారం కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ చిన్న బలరామయ్య తెలిపారు. నిందితుల కోసం గాలిస్తున్నట్టు తెలిపారు.

శాస్త్రోక్తంగా ఊంజల్ సేవ

రాపూరు: పెంచలకోనలో శనివారం సాయంత్రం పెనుశిల లక్ష్మీనరసింహ స్వామి, ఆదిలక్ష్మీదేవి, చెంచులక్ష్మీదేవికి శాస్త్రోక్తంగా ఊంజల్ సేవ నిర్వహించారు. ఉదయం ప్రత్యేక పూజలు చేశా రు. అనంతరం విశేషంగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. తదుపరి ఉత్సవ విగ్రహాల ను అలంకార మండపంలోకి వేంచేపు చేసి తిరుచ్చిపై కొలువుదీర్చారు. సాయంత్రం సహస్ర దీపాలంకరణ మండపంలో ఊంజల్‌సేవ చేశారు.

లక్ష్మీ నరసింహస్వామికి ప్రత్యేక పూజలు



అన్నదానం చేస్తున్న ఉభయదారులు

గూడూరు రూరల్ : గూడూరు రూరల్ మండలం కందకూరు పంచాయతీలోని అలిమిలిలో కనమరాయి కొండపై వెలసిన లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో శనివారం ప్రత్యేక పూజలు చేశారు. తెల్లవారుజామునే సుప్రభాతంతో స్వామిని మేల్కొలిపి నిత్య కైంకర్యాలు చేశారు. అనంతరం విశేషంగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. భక్తులకు మధ్యాహ్నం అన్నదానం చేశారు. ఈ కార్యక్రమానికి ఉభయకర్తలుగా పాలూరు రాజుపాళెంకు చెందిన శ్రీనివాసులు రాజు, స్వరూప, జాన్వకిశ్రీ వ్యవహరించారు.

25 మందికి జరిమానా

వెంకటగిరి(సైదాపురం) : వెంకటగిరి పట్టణంలో మద్యం సేవించి వాహనాలు నడిపిన సుమారు 25 మందిపై వెంకటగిరి పోలీసులు కేసులు నమోదు చేసి శనివారం కోర్టులో హాజరుపరిచారు. వారికి వెంకటగిరి జూనియర్ సివిల్ జడ్జి జరిమానా విధించారు. రూ.10 వేల చొప్పున 19 మందికి, రూ.5 వేల చొప్పున ఆరుగురికి జరిమానా విధించినట్టు ఎస్ఐ సుబ్బారావు తెలిపారు. మద్యం సేవించి వాహనాలు నడిపితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

గోడ కూలి వ్యక్తి మృతి

గూడూరు రూరల్ : గూడూరు సమీపంలోని గ్రామ దేవత గుడి వద్ద శనివారం గోడ కూలి మృతి చెందాడు. రూరల్ పోలీసుల కథనం మేరకు.. చిల్లకూరు మండలంలోని తిమ్మనగారిపాళెంకు చెందిన పాపయ్య(55) శనివారం కూలి పనుల కోసం వచ్చాడు. తాళ్లమ్మ గుడి వద్ద ఉండగా గోడ కూలింది. దీంతో తీవ్రంగా గాయపడిన అతను అక్కడికక్కడే మృతి చెందాడు. ఆలయానికి వచ్చిన భక్తులు ఈ విషయాన్ని గుర్తించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. వారు అక్కడికి చేరుకుని పరిశీలించారు. అనంతరం మృతదేహాన్ని గూడూరు ఏరియా ఆస్పత్రికి తరలించారు. కుటుంబ సభ్యులకు సమాచారం అందించి కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

విద్యార్థులకు వైద్య పరీక్షలు



దొరవారిసత్రం : మండలంలోని కుక్కపల్లివారికండ్రిగ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు శనివారం రాష్ట్రీయ బాల స్వస్థత కార్యక్రమంలో భాగంగా తొగరాముడి పీహెచ్‌సీ వైద్య సిబ్బంది వైద్య పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది రాజకుమారి, భాగ్యలక్ష్మి, మున్నెమ్మ, సుప్రియ, హెచ్ఎం శ్రీనివాసులు పాల్గొన్నారు.

ముగ్గురు తమిళ యువకుల అరెస్టు

తడ: కత్తి పట్టుకుని తిరుగుతున్న తమిళనాడుకు చెందిన ముగ్గురు యువకులను పోలీసులు శనివారం అరెస్టు చేశారు. ఎస్ఐ కొండపనాయుడి కథనం మేరకు.. తడ బజారులో ముగ్గురు యువకులు పెద్ద కత్తి పట్టుకుని తిరుగుతున్నట్టు డ్యూటీలో ఉన్న హెడ్ కానిస్టేబుల్ సమాచారం అందింది. ఆయన పోలీసు సిబ్బందితో కలిసి అక్కడికి చేరుకున్నారు. యువకులను అదుపులోకి తీసుకుని, కత్తిని స్వాధీనం చేసుకున్నారు. వారు చెన్నైకి చెందిన టి.సతీష్, ఎం.హరీష్, కె.నవీన్ కుమార్‌గా తేలింది. వారిపై పలు కేసులు ఉన్నట్టు గుర్తించారు. వారు నేరాలు చేసేందుకు తడ ప్రాంతానికి వచ్చినట్టు తేలడంతో అరెస్టు చేసి కోర్టుకు తరలించారు.

జామాయిల్ చెట్ల నరికివేత

ఓజిలి: మండలంలోని మనవాలిలో గుంటమడుగు భువనేశ్వరికి చెందిన జామాయిల్ చెట్లను గుర్తు తెలియని వ్యక్తులు నరికివేశారు. బాధితురాలు మాట్లాడుతూ గ్రామంలో సర్వే నంబర్ 194–1లోవున్న 2.75 ఎకరాలు అసైన్‌మెంట్ భూమిని ప్రభుత్వం తనకు 25 ఏళ్ల క్రితం మంజూరుచేసిందన్నారు. అందులో జామాయిల్ చెట్లు ఉన్నట్టు తెలిపారు. కొంతమంది తన భూమిని ఆక్రమించుకునేందుకు ప్రయత్నించారని వాపోయారు. దీనిపై తహసీల్దార్ రెవెన్యూ కోర్టు ఏర్పాటు చేసి విచారిస్తున్నారని తెలిపారు. రెండు రోజుల క్రితం జామాయిల్ చెట్లను నరికివేశారని వాపోయారు. దీంతో రూ.2 లక్షలు వరకు నష్టం వాటిల్లిందని, దుండగులపై చర్యలు తీసుకోవాలని కోరారు.

బీసీ కార్పొరేషన్ రుణాలకు దరఖాస్తులు

నాయుడుపేట టౌన్ : బీసీ కార్పొరేషన్ కింద రుణాలకు పొందేందుకు ఈనెల 7 తేదీ దరఖాస్తు చేసుకోవాలని నాయుడుపేట మున్సిపల్ కమిషనర్ షేక్ ఫజులుల్లా, ఎంపీడీవో సురేష్‌బాబు తెలిపారు. అభ్యర్థులు కుల ధ్రువీకరణ, రేషన్ కార్డు, ఆధార్ కార్డు, పుట్టిన తేదీ సర్టిఫికెట్, పాస్‌పోర్టు సైజ్ ఫొటో, బ్యాంక్ పాస్‌బుక్, సెల్‌ఫోన్ నంబర్లను దరఖాస్తులో పొందుపరచాలని సూచించారు.